
సాక్షి ఒడిశా
బుధవారం । 10 । ఏప్రిల్ । 2024


శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు రూ. 3,95,958
బంగారం 120 మిల్లీ గ్రాములు
వెండి 15 గ్రాముల 750 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ


పోటెత్తిన భక్తజనం
తరతరణి అమ్మవారి సన్నిధికి భక్తులు పోటెత్తారు. దానికి తగ్గట్టు ఏర్పాట్లు చేశారు.
- 8లో


ఇఫ్తార్
బుధ
6.14
రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

బరంపురం ఎస్పీ బాధ్యతల స్వీకరణ


బరంపురం ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న డీఐజీ సర్తక్ సడంగి

బరంపురం : బరంపురం ఎస్పీగా డీఐజీ సర్తక్ సడంగి మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నాక.. ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

జగన్నాథ ఆలయం సీఏఓగా వీర విక్రమ్ యాదవ్


వీర విక్రమ యాదవ్

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథ ఆలయం ప్రధాన పాలన అధికారి (సీఏఓ)గా వీర్ విక్రమ్ యాదవ్ నియమితులయ్యారు. ఆయన 1996 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. యాదవ్ ఇంతకు ముందు 2022 ఏప్రిల్ నెల 5న ఈ హోదాలో బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర న్యాయ శాఖ తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం మరోసారి నియమితులయ్యారు. వీర్ విక్రమ్ యాదవ్ ప్రస్తుతం నిర్మాణం, పౌర సరఫరాలు, వినియోగదారుల సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. తాజా ఉత్తర్వుల ప్రకారం శ్రీ జగన్నాథ ఆలయం ప్రధాన పాలన అధికారి హోదాలో నిర్మాణం, పౌర సరఫరాలు, వినియోగదారుల సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.

విశ్రాంత కార్మికుల ధర్నాకు మద్దతు


విశ్రాంత కార్మికులకు మద్దతు పలుకుతున్న జుధిష్టర్ రాళో

జయపురం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జయపురం గగణాపూర్‌లోని సేవా పేపరుమిల్లు విశ్రాంత కార్మికులు ఐదు రోజులుగా మిల్లు ప్రధాన గేటు వద్ద ధర్నా చేస్తున్నారు. వీరికి పలు సంఘాల ప్రతినిధులు మద్దతు ప్రకటిస్తున్నారు. ఇందులో భాగంగా జయపురం సిటీ కోఆర్డినేషన్ కమిటీ (పట్టణంలో గల కార్మిక, ప్రజా సంఘాల సమన్వయ కమిటీ) మంగళవారం తమ మద్దతును ప్రకటించింది. మిటీ అధ్యక్షులు, కార్మిక నేత జుధిష్టర్ రాళో కార్మికులు ఆందోళన జరుపుతున్న మిల్లు ప్రధాన గేటు వద్దకు కమిటీ ప్రతినిధులతో వచ్చి వారికి మద్దతు తెలియజేశారు. అధికారులు, జిల్లా కలెక్టర్, జయపురం సబ్‌కలెక్టర్లను కలిసి విశ్రాంత కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని కోరనున్నట్టు హామీ ఇచ్చారు. బిజినెస్ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంట్ చేసి ఎందుకు అమలు చేయటంలేదని మిల్లు యాజమాన్యాన్ని సూటిగా ప్రశ్నించారు. ఐదు నెలలుగా జీతాలు చెల్లించటం లేదని, కార్మికులతోపాటు విశ్రాంత కార్మికులకు పీఎఫ్, గ్రాడ్యుటీ, పెన్షన్ బకాయిలు చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ వైద్యుల ప్రైవేట్ ప్రాక్టీస్‌పై విచారణ

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు తాఖీదు

భువనేశ్వర్: ప్రభుత్వ వైద్యుల ప్రైవేట్ ప్రాక్టీస్ వల్ల సర్కార్ ఆధ్వర్యంలో నడిచే ఆరోగ్య సౌకర్యాల కేంద్రాల్లో వైద్య, చికిత్స సేవల నాణ్యత దెబ్బతింటుంది. దానికి వ్యతిరేకంగా జోక్యం చేసుకోవాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం విచారణకు స్వీకరించిన హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి తాఖీదులు జారీ చేసింది. కటక్‌కు చెందిన సామాజిక కార్యకర్త నారాయణ్ చంద్ర జెనా ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. ప్రధాన న్యాయమూర్తి చక్రధర్ శరణ్ సింగ్, జస్టిస్ శిబొ శంకర్ మిశ్రాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం నాలుగు వారాల తర్వాత తదుపరి విచారణకు ఆదేశించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు ప్రైవేట్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా తనిఖీ చేసేందుకు కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని పిటీషినర్ కోర్టును ఆశ్రయించారు. ప్రైవేట్ ప్రాక్టీస్‌ను ప్రభుత్వం నిషేధించి వారికి నాన్ ప్రాక్టీసింగ్ అలవెన్స్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. ఈ కేసులో రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి, ఆరోగ్య సేవల డైరెక్టర్‌లను కక్షిదారులుగా చేర్చారు. నారాయణ్ చంద్ర జెనా తొలుత 2023 అక్టోబర్ 19న ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. నాన్-ప్రాసిక్యూషన్ కారణంగా ఆ సంవత్సరం నవంబర్ ఏడో తేదీన హై కోర్టు ధర్మాసనం కొట్టి వేసింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరి 16వ తేదీన పిల్ పునరుద్ధరణ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను అదే ధర్మాసనం విచారణకు స్వీకరించింది.

ఉత్సాహంగా ఉగాది


తెలుగు సౌరభం మహిళా బృందం కోలాటం


బాలల నృత్య ప్రదర్శన

భువనేశ్వర్: క్రోధి నామ సంవత్సరం ఉగాది వేడుకలు ఖుర్దారోడ్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఈ ప్రాంతంలో తెలుగు కుటుంబాలు ఈ వేడుకల్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నాయి. తెలుగు సౌరభం ఆధ్వర్యంలో సంప్రదాయ పంచాంగ శ్రవణం, షడ్రుచుల ఉగాది పచ్చడి సేవన ఆచారంతో ఆరంభమైన వేడుకల్లో నాలుగేళ్ల నుంచి 80 ఏళ్ల వయసు వారంతా పాల్గొన్నారు. సాహితీ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ధార్మిక ఆధారిత క్విజ్ పోటీలు, సినీ సంగీత, నృత్య కార్యక్రమాలతో ఉత్సవ ప్రాంగణం కళకళలాడింది. ప్రధానంగా మహిళలు ప్రదర్శించిన కోలాటం నృత్య ప్రదర్శన ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించింది.

ఉగాది ర్యాలీలో యాంకర్ రష్మి


కలశ యాత్రలో పాల్గొన్న రష్మి

రాయగడ: జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు ఆధ్వర్యంలో స్థానిక హొటల్ తేజస్వి మైదానంలో జరిగిన ఉగాది వేడుకల్లో యాంకర్ రష్మి పాల్గొన్నారు. మజ్జిగౌరి మందిరం నుంచి కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలను నిర్వహించిన అనంతరం కలశ యాత్ర ప్రారంభమైంది. రష్మిని చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.


కలశ యాత్రలో నెక్కంటి

రాయగడలో..


పంచాంగం చదివి వినిపిస్తున్న వేదపండితులు


కవితా గోష్టిలో కవితను చదివి వినిపిస్తున్న బాబురావు మహంతి

రాయగడ: జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ, స్థానిక స్పందన సాహితీ, సాంస్కృతిక సంస్థ సంయుక్తంగా శ్రీరామలింగేశ్వర ఆలయంలో పంచాంగ శ్రవణం, కవితా గోష్టి కార్యక్రమాలు నిర్వహించాయి. కార్యక్రమంలో భాగంగా వేదపండితులు రేజేటి శ్రీనివాస్ శర్మ, రేజేటి శ్రీరాం శర్మలు క్రోధి నామసంవత్సరంలో జరిగే శుభాశుభాలను వివరించారు. అనంతరం జరిగిన కవితా గోష్టిలో కవులు, రచయితలు పాల్గొని తమ కవితలు చదివి వినిపించారు. ఈ పోటీల్లో డాక్టర్ బాబురావు మహంతి ప్రథమ బహుమతిని, డాక్టర్ తులసి దాస్ ద్వితీయ బహుమతిని, జి.శంకరరావు తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. అనంతరం ఉగాది పచ్చడిని అంతా సేవించారు.

'పాడి పంటలు పుష్కలం'


పంచాంగం వింటున్న సమాజం ప్రతినిధులు సత్యనారాయణ బాబు, ఈపలి జయంతిరావు తదితరులు


దీపారాధన చేస్తున్న ఆంధ్ర భాషాభివర్ధిని సమాజం ప్రతినిధులు

బరంపురం : ఈ ఏడాది 2024లో పాడి పంటలు పుష్కలంగా ఉంటాయని, అందరూ అభివృద్ధి చెందుతారని తెలుగు పండితులు డాక్టర్ కొల్లూరి నారాయణ రావు చెప్పారు. మంగళవారం క్రోధి నామ సంవత్సరం ఉగాది సందర్భంగా స్థానిక గిరి మార్కెట్ రోడ్‌లో గల ఆంధ్ర భాషాభివర్ధిని సమాజం ఆధ్వర్యంలో పంచాంగ పఠనం నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లూరి మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ఉగాది పండగ కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని తెలిపారు. పంచాంగ పఠనం వినటం వల్ల పాత తప్పులు తెలుసుకుంటామన్నారు. ఈ ఏడాది కిందటి సంవత్సరం కన్నా అన్ని విషయాల్లో బాగుటుందని చెప్పారు. ప్రజలకు వృద్ధి ఉద్యోగం, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. పాడి పంటలు 62 శాతం వృద్ధి చెందుతాయన్నారు. అనంతరం తెలుగు పండితులు డాక్టర్ కొల్లూరి నారాయణ రావును సత్కరించి ఉగాది పచ్చడి ఆరగించారు.


ఉగాది వేడుకలు ప్రారంభిస్తున్న కార్యవర్గ సభ్యులు

చైతన్య ఆంధ్ర సాహితీ ఆధ్వర్యంలో..


ఆకట్టుకున్న భరతనాట్యం

పర్లాకిమిడి: చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి ఆధ్వర్యంలో శ్రీక్రోధి నామ సంవంత్సర ఉగాది వేడుకలు కరణం వీధిలోని ఫంక్షన్ హాల్‌లో ప్రవాసాంధ్రులు ఘనంగా నిర్వహించారు. సమితి అధ్యక్షుడు పి.ఆనందరావు, కార్యదర్శి బర్నాల జనార్ధనరావు, సలహాదారుడు వి.ఎస్.ఎన్.రాజు ఉత్సవాలను ప్రారంభించారు. చైతన్య ప్రార్థనా గీతాన్ని అల్లాడ లక్ష్మణరావు ఆలపించారు. వేదంభట్ల వెంకట రమణ మూర్తి పంతులు పంచాంగ శ్రవణం చేశారు. ఈ ఏడాది వర్షాలు అతి తక్కువగా కురుస్తాయన్నారు. అనంతరం చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. పరిణీధి, ఊర్విక, ఈశ్వరీ బృందం భరతనాట్యంతో ప్రేక్షకులను అలరించారు.

జయపురంలో..


నెహ్రూనగర్‌లో చిన్నారుల మ్యూజికల్ చైర్ పోటీలు

జయపురం: జయపురంలో తెలుగు వారి నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగు వారు నూతన వస్త్రాలు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక సంఘం వారు హిందూ నూతన సంవత్సరం ఉత్సవాన్ని నిర్వహించారు. నెహ్రూనగర్‌లో స్థానికులు ఉగాది సందర్భంగా డాన్స్, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

పర్లాకిమిడిలో..


పర్లాకిమిడిలో దక్షిణ భారత బ్రాహ్మణ సంఘం ఉగాది వేడుకల్లో అతిథులను పరిచయం చేసిన వి.కూర్మనాథం


వి.వి.రమణమూర్తి పంతులు పంచాంగ పఠనం

పర్లాకిమిడి: దక్షిణ భారత బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక జంగంవీధి జంక్షన్ వద్ద ఎస్‌పి ఫంక్షన్ హాల్‌లో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత కార్యక్రమాన్ని అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఆర్.రవి, కార్యదర్శి ఎం.శివరామక్రిష్ణ, గౌరవ అతిథి డాక్టర్ రామలక్ష్మి ప్రారంభించారు. అనంతరం వేదంభట్ల వేంకటరమణ మూర్తి పంతులు ఆధ్వర్యంలో పంచాంగ పఠనం జరిగింది. బ్రాహ్మణ సంఘం సభ్యులు ఉగాది కవితా పఠనం అనంతరం పరిమి శంకర ప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయులు చట్టి వేంకటేశ్వరావులకు ఆత్మీయ సత్కారం చేశారు. విజయనగరం సంగీత పాఠశాల అధ్యాపకులు బి.ఎ.నారాయణ సంగీత విభావరి ఆకట్టుకుంది.

సందడే సందడి


ఉగాది ఉత్సవాల పూజల్లో తెలుగు జేసీఐ, వైశ్య మహిళలు


ఉగాది ఉత్సవాల్లో ఆకట్టుకుంటున్న నరసింహావతార ప్రదర్శన


ఆకట్టుకుంటున్న సంబరాలు


ఉగాది ఉత్సవాల్లో ఆకట్టుకుంటున్న పట్టు చీరల రెప రెపలు, బంగారు నగల ధగధగలు

బరంపురం : తెలుగు సంప్రదాయం ఉట్టి పడింది. బరంపురంలో జేసీఐ లేడీస్ క్లబ్, వైశ్య, తెలుగు మహిళలు చేపట్టిన ఉగాది వేడుకలు సందడిగా జరిగాయి. కస్పావీధి, సబుద్ధిపేట కల్యాణ మండపం ప్రాంగణంలో సంబరాలు నిర్వహించారు. జేసీఐ బరంపురం మహిళలు సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు జె.హరిప్రియ, కార్యదర్శి జె. సుకన్యా, ప్రాజెక్ట్ చైర్మన్ భాగ్యం బెహరా, ఆర్గనైజర్ కె. కుసుమ, ఎస్. స్వాప్న, పి.లక్ష్మి, ఎం.అనురాధ, లలిత, అన్నపూర్ణ, మమతా, జయశ్రీ. సుప్రియా, ఆశ్వాని బ్రాహ్మం, మోలాన తదితర తెలుగు మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి పవిత్ర సాంతను గెలిపించాలి


నారాయణపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

- జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ విజ్ఞప్తి

జయపురం: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని విధానసభలో కాంగ్రెస్ పార్టీ చీఫ్‌విప్, జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ విధానసభ నియోజకవర్గం నారాయణపట్నలో మంగళవారం పర్యటించారు. ఆయనకు స్థానికుల నుంచి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. నారాయణపట్న ఫారెస్టు కార్యాలయ కూడలి నుంచి బయలు దేరిన ర్యాలీ శ్రీజగన్నాథ్ మందిరం మీదుగా పలు వీధుల్లో సాగింది. ర్యాలీలో లక్ష్మీపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పవిత్ర సాంత, జిల్లా పార్టీ అధ్యక్షుడు శశిభూషణ పాత్రోతో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాహిణీపతి మాట్లాడుతూ.. ఈ నియోజకవర్గం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్నివిధాల అభివృద్ధి చెందిందని ప్రజలకు గుర్తు చేశారు. పవిత్ర సాంత యువకుడు ప్రజలకు సేవా దృక్పథంతో ఎన్నికల బరిలో దిగారని.. చేయి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని నాయకులు కోరారు.

గీతాంజలి పిడిక గైర్హాజర్

లక్ష్మీపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ టిక్కెట్ ఆశించిన బందుగాంలో సీనియర్ కాంగ్రెస్ మహిళా నాయకురాలు గీతాంజలి పిడిక నారాయణపట్నలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీకి డుమ్మా కొట్టారు. బందుగాం సమితి నుంచి వందలాది మంది ప్రముఖ నేతలు, పార్టీ శ్రేణులు తరలివచ్చినప్పటికీ ఆమెతోపాటు అనుచరులు హాజరు కాకపోవడం చర్చనీయంశమైంది. అయితే తాము నిర్వహించిన ర్యాలీకి నియోజకవర్గంలోని అన్ని సమితుల అధ్యక్షులు, పార్టీ సర్పంచ్‌లు, సమితి సభ్యులు, కార్యకర్తలు పాల్గొని తనకు మద్దతు పలికారని అభ్యర్థి పవిత్ర సాంత విలేకరులకు తెలిపారు.

17 చేపలు @రూ.18 లక్షలు

- కాసులు కురిపించిన తెలియా బోరే చేపలు


మత్స్యకారుల వలలకు చిక్కిన అరుదైన తెలియా చేపలు

భువనేశ్వర్: మత్స్యకారుల పంట పండి. జగత్‌సింగ్‌పూర్‌లోని పారాదీప్ తీరంలో చేపట్టిన చేపల వేటలో అరుదైన తేలియా బోరే చేపలు మత్స్యకారుల వలలకు చిక్కాయి. ఓడరేవు పట్టణానికి చెందిన మత్స్యకారులు సోమవారం రాత్రి వలలు విసిరారు. మంగళవారం ఉదయం వెళ్లి చూడగా వలలకు చిక్కిన 17 తేలియా చేపలను గుర్తించి వాటిని ఒడ్డుకు చేర్చారు. మత్స్యకారులు వీటిని వేలం ప్రాంతానికి తీసుకెళ్లారు. రూ.18 లక్షలకు అమ్ముడుపోయాయి. ఈ చేపల బరువు 3 క్వింటాళ్లకు పైగా ఉంది. ఓ ప్రైవేట్ సంస్థ మత్స్యకారుల నుంచి ఈ చేపలను కొనుగోలు చేసిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ తేలియా చేపలకు ఔషధ విలువలు ఉండటంతో అధిక డిమాండ్ ఉంది. అరుదైన చేపల పేగులను కొన్ని ఔషధాల తయారీలో ఉపయోగిస్తున్నందున అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

ఉత్కళ సంబాధిక సంఘం నిరసన


బొరిగుమ్మ సమితి కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న జర్నలిస్టులు

జయపురం: ఉత్కళ సంబాధిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శుల పిలుపు మేరకు కొరాపుట్ జిల్లా శాఖ సభ్యులు వినూత్నంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రతి వారం ఒక సమితి కార్యాలయం ముంగిట ఆయా సమితిలోని పాత్రికేయులు, ఎలక్ట్రానిక్ మీడియ ప్రతినిధులు జర్నలిస్టుల సమస్యలు, హక్కుల కోసం కళ్లకు నల్లగంతలు కట్టుకొని నిరసన తెలియజేయాలని పిలుపు ఇచ్చింది. ఈ మేరకు బొరిగుమ్మ సమితి కార్యాలయం ఎదుట సంఘ సభ్యులు మంగళవారం నిరసన తెలియజేశారు. సంఘ బొరిగుమ్మ కోఆర్డినేటర్..సీనియర్ పాత్రికేయుడు సుదర్శణ ప్రధాన్ నేతృత్వంలో జరిగిన నిరసన ప్రదర్శనలో జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఉత్కళ సంబాధిక సంఘం రాష్ట్ర ప్రభుత్వం ముందుంచిన ఐదు డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు. ముఖ్యంగా జర్నలిస్టుల సురక్షా చట్టం అమలు చేయాలని, 60 ఏళ్ల పైవయసు జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని, ఆరోగ్య బీమా పథకం పరిమితి రూ. 25 లక్షలకు పెంచాలని, ప్రెస్ అకాడమి ఏర్పాటు చేయాలని, అక్రిడియేషన్ కమిటీని పునరుద్ధరించి సమితి, జిల్లా, రాష్ట్రస్థాయి జర్నలిస్టులకు అక్రిడియేషన్ కార్డులు అందజేయాలని కోరారు. సంఘ విజ్ఞప్తులను ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించేంత వరకు రాష్ట్రంలో వారంలో ఒక రోజు ప్రతి సమితి కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తామన్నారు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల డిమాండ్లను అంగీకరిస్తున్న నేపథ్యంలో జర్నలిస్టుల సమస్యలను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆందోళనలో జర్నలిస్టులు ఎస్.సుందరం, టుటు పటా్నయక్, విశ్వజిత్ పాణిగ్రహి, భానుప్రతాప్ నాయిక్, రామ చంద్రనాయిక్, నాల సుభాష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

38 కేజీల గంజాయి స్వాధీనం

- నలుగురు అరెస్ట్



మహారాష్ట్రకు చెందిన నిందితులు



శరీరంపై గంజాయిను చుట్టుకున్న దృశ్యం

మల్కన్‌గిరి: చిత్రకొండ రహదారిలో సోమవారం రాత్రి చిల్లా బలిమెల పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. నాలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో వారిని పట్టుకున్నారు. వారిని తనిఖీ చేయగా శరీరంపై గంజాయిని ఉంచి ప్లాస్టర్‌తో చుట్టారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ నితీష్ వాద్వనీ మాట్లాడుతూ 38 కేజీల గంజాయిని కడుపు భాగంలో ఉంచి ప్లాస్టర్‌ను చుట్టారన్నారు. పట్టుబడిన నిందితులు మహారాష్ట్రకు చెందిన మహమ్మద్ ఫైజాన్, షేక్ సారిఖ్, ఆశక్ పటేల్, చిత్రకొండకు చేందిర సునాథడ్ ఖీలోలు అన్నారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు. నాలుగు ఫోన్లు 4, రూ. 2100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్పీ తెలిపారు.

ఆదిత్యుని ఆదాయం 2.. వ్యయం 8

- అరసవల్లి క్షేత్రంలో ఘనంగా ఉగాది ఆస్థానం



ఆలయంలో పంచాంగ శ్రవణం

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం క్రోధి నామ సంవత్సర ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఇప్పిలి జోగి సన్యాసిరావు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన అనివెట్టి మండపంలో ఆగమ పండితుల నడుమ పంచాంగ శ్రవణం నిర్వహించారు. ముందుగా ఆలయానికి చెందిన కొత్త అకౌంట్స్ పుస్తకాలకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆరు రుచులతో ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. సంప్రదాయంగా క్రోధి నామ సంవత్సర పంచాంగ పఠనం కార్యక్రమం స్థానిక అనివెట్టి మండపంలో జరిపించారు. ముందుగా ఆదిత్యుని రాశిఫలాలను ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ చదివి వినిపించారు. ఆదిత్యుని నక్షత్రం విశాఖ అని, తులారాశి అని.. ఈమేరకు ఆదాయం 2.. వ్యయం 8 గానూ ఈ ఏడాది ఉంటుందని వివరించారు. అనంతరం భాస్కరభట్ల నర్సయ్య శర్మ ఉగాది ప్రాశస్త్యాన్ని, పంచాంగ శ్రవణ విశిష్టతను భక్తులకు ఉపదేశించారు. తర్వాత భక్తులకు వారి వారి నక్షత్ర,రాశిఫలాలను తెలియజేశారు.

అర్చకులకు ఘన సన్మానం

ఉగాది సందర్భంగా దేవదాయ శాఖ తరపున డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ ఆదేశాల మేరకు ఆల య అర్చకులు ఇప్పిలి రాజేశ్వర కాశ్యప శర్మ, ఇప్పిలి ఫణీంద్ర శర్మ, వేదపండితుడు దర్భముళ్ల శ్రీనివాస శర్మలకు ఉగాది పురస్కారాలను, ఒక్కొక్కరికి రూ.10,116 నగదును, ప్రశంసా పత్రాన్ని ట్రస్ట్ బోర్డు చైర్మన్ జోగి సన్యాసిరావు, ప్రధానార్చకులు శంకరశర్మలు సంయుక్తంగా అందజేసి ఘనంగా సత్కరించారు. అలాగే వీరితో పాటు ఆలయంలో పనిచేస్తున్న అర్చకులు, సూర్యనమస్కార పండితులకు కూడా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది బీఎస్ చక్రవర్తి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ. 4.48 లక్షలు స్వాధీనం



డీటీ గాయత్రి తనిఖీల్లో పట్టుబడిన మొత్తాన్ని లెక్కిస్తున్న పోలీసులు

నరసన్నపేట: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ వాహన తనిఖీలు ముమ్మరమవుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో పోలాకి మండలం రాళ్లపాడు కూడలి వద్ద రూ.1.64 లక్షలు, మడపాం టోల్‌గేట్ వద్ద రూ. 2,84,400 లను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి రశీదులు లేకపోవడంతో ఈ మొత్తాన్ని సీజ్ చేశారు. రాళ్లపాడు వద్ద స్థానిక డీటీ గాయత్రి ఆధ్వర్యంలోని స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.1.64 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే టోల్‌గేట్ వద్ద నరసన్నపేట ఎస్‌ఐ అశోక్‌బాబు తనిఖీలు చేపట్టారు. శ్రీకాకుళం నుంచి నరసన్నపేటకు బంగారం కొనుగోలు చేసేందుకు వెళ్తుండగా ఒక కారులో రూ.2.84 లక్షలు పట్టుబడ్డాయి.

తరతరణి అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తజనం

- ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు



ప్రత్యేక పూజలు అందుకుంటున్న మహా సరస్వతి అవతారంలో తరతరణి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకున్న బీజేడీ బరంపురం లోక్‌సభ అభ్యర్థి భృగుభక్షి పాత్రో

బరంపురం: గంజాం జిల్లా కేంద్రంలో రుశికుల్యా నదీ తీరంలో ఎత్తైన కొండపై కొలువైన తరతరణి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు మంగళవారం పోటెత్తారు. చైత్రమాసం మూడో వారం కావడంతో దక్షిణ ఒడిశా ప్రజల ఆరాధ్య దైవమైన అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు ఆసక్తి చూపారు. తరతరణి మహా సరస్వతీ అవతారంలో ఉన్న అమ్మవారిని టీ–5 కార్యదర్శి కార్తికేయ పాండ్యాన్ దర్శించుకొని తొలి పూజ చేశారు. దక్షిణ ఒడిశాలోని వివిధ జిల్లాలతో పాటు పక్క రాష్ట్రం నుంచి సుమారు ఆరు లక్షలమంది వరకు భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. చాలామంది తలనీలాలు సమర్పించుకున్నారు. కొండ దిగువున వంటా వార్పులు చేసుకొని ప్రత్యేక పూజలు చేసి కుటుంబ, స్నేహితుల సమేతంగా విందు భోజనాలు చేశారు. తరతరణి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి మధ్యాహ్నం రాజభోగం, సాయంత్రం సంధ్యా హారతి, రాత్రి బెడా చేపట్టి అమ్మవారి ఉత్సవ దేవతలను ప్రత్యేక రథంలో ఉంచి తిరువీధి నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అటంకం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల కోసం డీఎస్పీస్థాయి అధికారితో పాటు పది మంది ఎస్సైలు, వందిమంది కానిస్టేబుళ్ల బందోబస్తున నిర్వహించారు. కమిటీ కార్యదర్శి ప్రమోద్ కుమార్ పండా పాల్గొన్నారు.



కొండపై కిక్కిరిసిన భక్తజనం



తరతరణి అమ్మవారిని దర్శించుకుంటున్న టీ-5 కార్యదర్శి కార్తికేయ పాండ్యాన్



అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తజనం



తలనీలాలు అర్పిస్తున్న చిన్నారులు



కొళిగాంలో సుజలధార నీటిని తీసుకెళ్తున్న మహిళలు



సరిహద్దు సెగ్మెంట్‌లో ప్రగతి పొద్దు

తూరుపు తీరాన ఉన్న ఇచ్ఛాపురంలో ప్రగతి పొద్దు పొడిచింది. దశాబ్దాలుగా చావుకు అలవాటు పడిపోయిన కిడ్నీ బాధిత పల్లెల గొంతు తడిపేందుకు వంశధార పరుగులు పెట్టుకుంటూ వచ్చింది. బాధితుల కోసం స్థానిక ఆస్పత్రులకు కొత్త వసతులు వచ్చాయి. ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్లకు ఈ ఐదేళ్లలోనే మోక్షం కలిగింది. దశాబ్దాల నిరీక్షణలకు ఫలితంగా నూతన పీహెచ్‌సీలు నిర్మాణమయ్యాయి. 2019–24 కాలాన్ని నియోజకవర్గ ప్రజలు మర్చిపోలేని రీతిలో ప్రభుత్వం వరాలు కురిపించింది.



మఖారాంపురంలో వైఎస్సార్ సుజలధారను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ (ఫైల్)

- ఇచ్ఛాపురంలో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం
- కొత్తగా మౌలిక వసతుల కల్పన
- సంక్షేమ పథకాల ద్వారా పేదలకు రూ.1473.86 కోట్లు
- రూ.680.16 కోట్లతో అభివృద్ధి పనులు

కంచిలి:

రాష్ట్రానికి ముఖద్వారమైన ఇచ్ఛాపురంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టించింది. ఈ నియోజకవర్గం 1951 లో ఏర్పడిన నాటి నుంచి చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా 2019–24 మధ్య కాలంలో అభివృద్ధితోపాటు దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం దొరికింది. కిడ్నీవ్యాధి మహమ్మారిని సమూలంగా తుద ముట్టించడానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నడుంకట్టారు. ఇంటింటికి రక్షిత మంచినీటిని సరఫరా చేయాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టును ఏర్పాటు చేసి జాతికి అంకితం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రూ.680.16 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు సంక్షేమ పథకాల ద్వారా రూ.1473.86 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు.



కొత్త దారులు

- సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాల ఉద్దానం గ్రామాలను కలిపే ఎస్‌కేఈ రోడ్డును రూ.31.80 కోట్లతో విస్తరించారు.
- ఇచ్ఛాపురం నుంచి పురుషోత్తపురం వరకు రోడ్డు అభివృద్ధిని రూ.5కోట్లతో చేపట్టారు. బూర్జపాడు నుంచి డొంకూరు వరకు రూ.3.67 కోట్లతో, కొల్లూరు రోడ్డును రూ.16లక్షలతో, బుడ్డెపుపేట నుంచి బాలకృష్ణాపురం రోడ్డు రూ.74లక్షలతో, పోలేరు రోడ్డును రూ.89.6లక్షలతో, మండపల్లి, రుషికుద్ద రోడ్డును రూ.65లక్షలతో అభివృద్ధి చేశారు.



నూతనంగా నిర్మితమైన ఎస్‌కేఈ రోడ్డు

కొత్త బస్సులు, రైళ్లు



సోంపేట స్టేషన్‌లో విశాఖపట్నం-బరంపురం ప్యాసింజర్‌కు స్వాగతం చెప్పి, లోకో పైలెట్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

- ఇచ్ఛాపురం మండలంలో ఇచ్ఛాపురం నుంచి మశాకపురం, బిర్లంగి మీదుగా కొలిగాం వరకు 7 కిలోమీటర్లకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.
- విశాఖపట్నం–పలాస ప్యాసింజర్ రైలును బరంపురం వరకు విస్తరించడానికి, ఇచ్ఛాపురంలో వందే భారత్ రైలు హాల్టుకు కృషి చేసి సఫలీకృతమయ్యారు.

విద్యకు ప్రాధాన్యత..



బారువ డిగ్రీ కళాశాల

నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కోసం నాడు–నేడు పథకంతో పాఠశాలలు, కళాశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది. దీంతోపాటు బారువ డిగ్రీ కళాశాలకు కొత్త భవనాల్ని రూ.5కోట్లతోను, సోంపేట జూనియర్ కళాశాలకు రూ.2కోట్లతో కొత్త భవనాల్ని నిర్మించారు.



కవిటిలో 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్

దశాబ్దాల కలలను సాకారం చేశాం



ఇచ్ఛాపురంలో దీర్ఘకాలిక సమస్యలు ఎన్నింటినో ఈ ఐదేళ్లలో పరిష్కరించాం. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో రూ.58 కోట్లతో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేశాం.

- వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టుకు రూ.700 కోట్లు ఖర్చుచేయగా, అందులో అగ్రభాగం రూ.400 కోట్లకుపైగా నిధులు ఇక్కడే వెచ్చించడం జరిగింది.
- రూ.20 లక్షలతో పైడిగాం చానెల్ మరమ్మతులు, రూ.30 లక్షలతో బారువ గ్రోయిన్ పునర్నిర్మాణ పనులు, రూ.15 లక్షలతో రుషికుద్దలో కొత్త షట్టర్లు, రూ.35లక్షలతో కేశుపురం గ్రోయిన్ మరమ్మతులు చేపట్టాం.
- కవిటిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి 11కెవి సబ్‌స్టేషన్‌ను రూ.4.5కోట్లతో ఏర్పాటు చేశాం. ప్రకృతి వైపరీత్యాల సమయంలో విద్యుత్ సమస్యలు అధిగమించడానికి రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా 4 మండలాల్లో 24 గంటలపాటు కరెంటు ఉండేందుకు త్రీఫేజ్ లైన్‌ను టౌన్‌ఫీడర్ రూ.5కోట్లతో ఏర్పాటు చేస్తున్నాం. ఇచ్ఛాపురం నుంచి రాజపురం మీదుగా బొరివంక సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ లైన్‌ను ఏర్పాటు చేశాం. కొర్లాం వద్ద 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదన ఫైనల్ స్టేజికి చేరింది. ఇక్కడ ఎలాంటి ఇండస్ట్రీ పెట్టాలన్నా 132 కేవీ సబ్‌స్టేషన్ ద్వారా కరెంటు సరఫరా చేయొచ్చు.
- ఇచ్ఛాపురం మండలం అరకభద్ర బ్రిడ్జిని రూ.12 కోట్లతోను, డొంకూరు, బూర్జపాడు బ్రిడ్జిలు రూ.17కోట్లతోను, బూర్జపాడు బ్రిడ్జిని రూ.10.5కోట్లతో మహేంద్రతనయ బ్రిడ్జిను రూ.14.6కోట్లతో, కొండిరేవు బ్రిడ్జిని రూ.3.5కోట్లతో మంజూరు చేశాం.
- వైద్య రంగానికి సంబంధించి ఇచ్ఛాపురం సీహెచ్‌సీని రూ.5కోట్లతో, ఇచ్ఛాపురం, బెల్లుపడ యూపీహెచ్‌సిలను రూ.1.75 కోట్లు చొప్పున, ఈదుపురం, మాణిక్యపురం పీహెచ్‌సీలను రూ.1.75కోట్లుతో అభివృద్ధి చేశాం. కిడ్నీ డయాలసిస్ యూనిట్లను సోంపేట సీహెచ్‌సీలో 21 బెడ్స్‌ను, కవిటి సీహెచ్‌సీలో 19బెడ్స్‌ను ఏర్పాటు చేశాం. ఇచ్ఛాపురం సీహెచ్‌సీలో కూడా డయాలసిస్ యూనిట్స్‌ను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించాం. అంతేకాకుండా నియోజకవర్గంలో ఏడు చోట్ల కోవిడ్ సమయంలో తీవ్ర పరిస్థితులను ఎదుర్కొనేందుకుగాను ఐసొలేషన్ యూనిట్లను ఏర్పాటు చేశాం. సోంపేట, ఎంఎస్‌పల్లి, బట్టిగళ్లూరు, కంచిలి తదితర ఆస్పత్రుల్లో రూ.70లక్షలతో పనులు చేశాం.

పిరియా విజయ, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఇచ్ఛాపురం



వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన లబ్ధి

పథకం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.లక్షల్లో)
వైఎస్సార్ రైతు భరోసా	36,892	20,547.74
యంత్ర సేవా పథకం	41	240.87
వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాలు	10,164	195.59
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	2,873	318.16
వైఎస్సార్ కాపు నేస్తం	606	317.40
జగనన్న చేదోడు	1,610	564.20
ఈబీసీ నేస్తం	620	174.45
జగనన్న విద్యా దీవెన	6,884	4,588.16
జగనన్న వసతి దీవెన	6,547	1,814.76
జగనన్న తోడు	4,320	1,713.10
వైఎస్సార్ పెన్షన్ కానుక	43,444	52,617.78
వైఎస్సార్ చేయూత	24,896	13,161.19
వైఎస్సార్ సున్నావడ్డీ(ఎస్‌హెచ్‌జీ)	84,522	2,443.85
వైఎస్సార్ ఆసరా	66,971	12,325.42
మత్స్యకార భరోసా	4,220	1,670.10
మత్స్యకార డీజిల్ సబ్సిడీ	415	32.57
వైఎస్సార్ వాహనమిత్ర	1,192	241.90
జగనన్న అమ్మ ఒడి	30,235	17,598.45
జగనన్న విద్యా కానుక	38,267	1,066.35
జగనన్న గోరుముద్ద	34,569	1,365.52
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	3,464	2,215.70
పేదలకు ఇల్లు	926	319.00

క్లుప్తంగా

అలరించిన భక్తిగీతాలాపన



భక్తిగీతాలాపన చేస్తున్న భీష్మారావు బృందం

విజయనగరం టౌన్: స్థానిక మూడులాంతర్లు వద్దనున్న పైడితల్లి అమ్మవారి చదురుగుడి ఆవరణలో ప్రతి మంగళవారం నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీవారి స్వచ్ఛంద సేవా సంఘం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు సారథ్యంలో నిర్వహించిన భక్తి గీతాలాపన ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. గాయనీగాయకులు అమ్మవారిని స్తుతిస్తూ పలు కీర్తనలు ఆలపించారు. ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు సంస్థ ప్రతినిధులను దుశ్శాలువాలతో సత్కరించి, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పైడిమాంబ కళాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు గ్రామాల్లో తోటలు దగ్ధం



భర్తవానిపాలెంలో కాలిపోతున్న నీలగిరి తోటలు

వేపాడ: మండలంలోని భర్తవానిపాలెం, వేపాడ గ్రామాల్లో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదాల్లో నీలగిరి, జీడిమామిడి, మామిడి తోటలు దగ్ధమయ్యాయి. ఇందుకు సంబంధించి ఎస్.కోట అగ్నిమాపక హెడ్‌కానిస్టేబుల్ శ్రీను అందించిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం భర్తవానిపాలెంలో జరిగిన ప్రమాదంలో పలువురు రైతులకు సంబంధించిన నీలగిరి తోటలు, అలాగే వేపాడ రెవెన్యూలోని గుత్తివారితోటలో ఎకరా విస్తీర్ణంలో జీడిమామిడి, మామిడి మొక్కలు దగ్ధమయ్యాయని చెప్పారు.

ఏడుగురు పందెం రాయుళ్ల అరెస్ట్



జగ్గరాజుపేటలో పోలీసుల అదుపులో పందెంరాయుళ్లు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని జగ్గరాజుపేట గ్రామ శివారులో కోడి పందాల స్థావరంపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. తమకు వచ్చిన ముందస్తు సమాచారంతో ఎస్సై రామగణేష్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీ నిర్వహించి..గ్రామ శివారులో కోడి పందాలు ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7,510 నగదు, నాలుగు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం కోర్టుకు అప్పగించామని చెప్పారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తమకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఇంగ్లిష్ స్పీకింగ్‌లో ఉచిత శిక్షణ

క్యూఆర్ కోడ్

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో ప్రాథమిక విద్య నుంచీ ఇంగ్లీషు మీడియాన్ని అందుబాటులోకి తేవటం ప్రశంసనీయమని 'మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్' వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎ.చిరంజీవి అభిప్రాయపడ్డారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా ఏ రంగంలోనైనా ఇంగ్లీషుపై పట్టున్న వారికే అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయని చెబుతూ.... ఆసక్తి ఉన్నవారి కోసం తమ సంస్థ ఉచితంగా ఇంగ్లీషు స్పీకింగ్ కోర్సు ను అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. 'మా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి 30 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈజీ ఇంగ్లీష్ కార్యక్రమాన్ని తలపెట్టాం. ఆన్‌లైన్లో ఉచితంగా అందజేస్తాం' అని చెప్పారాయన. ఈజీ ఇంగ్లీష్ ద్వారా స్పోకెన్ ఇంగ్లీష్ మాత్రమే కాకుండా దాదాపు 9 రకాల అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు. ఈ నెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నా రు. 'ఈ కోర్సుకు ఆసక్తి ఉన్న ఎవరైనా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం దిగువ ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుంటే చాలు. వారి మొబైల్‌కు రిజి స్ట్రేషన్ లింకు వస్తుంది. లేని పక్షంలో 9866006662 ఫోన్ నంబర్‌కు వాట్సా ప్ ద్వారా వివరాలు పంపినా వారి మొబైల్ ఫోన్‌కు లింకును పంపిస్తాం' అని వివరించారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రి య ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతుందని, ఆ తర్వాత తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు.

రోగులకు రుచికర భోజనం

భోజనం చాలా బాగుంది



నా పేరు కె.కృష్ణ. మాది గంట్యాడ మండలంలోని కరకవలస గ్రామం. ఆరోగ్యం బాగోలేదని ఐదురోజుల కిందట ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరాను. వైద్యసేవలు పొందుతున్నాను. ఆస్పత్రిలో చేరిన నుంచి భోజనం ఇస్తున్నారు. ఇంటి దగ్గర కంటే రుచిగా ఉంది. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెడుతున్నారు. పౌష్టికాహారం అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

కడుపునిండా భోజనం



ఆరోగ్యం బాగోలేదని పెద్దాస్పత్రిలో చేరాను. భోజనం ఎంత కావాలంటే అంత పెడుతున్నారు. కూర, సాంబారు, పెరుగు, గుడ్డు, మజ్జిగతో కూడిన భోజనం పెడుతున్నారు. ఉదయం ఇడ్లీ, ఉప్మా పెడుతున్నారు. చాలా బాగుంది. గతంలో ఈ స్థాయిలో రోగులకు భోజనం సమకూర్చేవారు కాదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక అన్ని సేవలకు ప్రాధాన్యం పెరిగింది.

– ఎస్.లక్ష్మణ, సరాయివలస, మక్కువ మండలం

- ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలు పొందేవారి శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి
- డైట్ చార్జీలను పెంచిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం
- టీడీపీ హయాంలో కేవలం రూ. 40 మాత్రమే..
- ఇప్పుడు రూ.40 నుంచి రూ.80కి పెంపు
- మానసిక రోగులకు రూ.56 నుంచి రూ.80కి పెంపు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుమారు ఐదేళ్లుగా ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తూ వైద్యరంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టింది. నాడు–నేడు కింద ఆస్పత్రులకు ఆధునిక సొబగులు అద్దింది. ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చింది. వైద్యులు, సిబ్బంది పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీచేసింది. పెద్దోళ్లకే పరిమితమైన ఫ్యామిలీ డాక్టర్ వైద్యాన్ని పేద ప్రజలకు చేరువచేసింది. ఊరూరా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించి ప్రజల ఆయుష్షు పెంచేలా వైద్యసేవలు అందించింది. ఊరికో హెల్త్ క్లినిక్‌ను అందుబాటులోకి తెచ్చింది. అదే స్థాయిలో పెద్దాస్పత్రులు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందేవారికి మెరుగైన వైద్యసేవలతో పాటు రుచికరమైన భోజనం అందిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వం కేవలం ఒక రోగికి రూ.40 చెల్లించేది. ఈ డబ్బులతోనే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించాలి. డబ్బులు చాలకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్లు నీళ్లలాంటి చారు, అరకొర అన్నం, రుచిలేని కూరలతో భోజనం పెట్టేవారు. దీంతో చాలామంది రోగులు ఇంటి వద్ద నుంచి క్యారేజీలు తెప్పించుకోవాల్సిన పరిస్థితి. రోగుల బంధువు బయట హోటల్స్‌లో భోజనం చేసేవారు. భోజనం బాగులేదంటూ రోగులు ఫిర్యాదులు, ఆందోళనలు చేసినా అప్పటి పాలకులు పట్టించుకునేవారు కాదు.

జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వాస్పత్రులకు కొత్త కళ వచ్చింది. రోగులకు వైద్యసేవలతో పాటు సేవల తీరులో సమూల మార్పులు వచ్చాయి. రోగుల విజ్ఞప్తిమేరకు రుచికరమైన భోజనం అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. డైట్ చార్జీలను ఒకేసారి రూ.40 నుంచి రూ.80కి పెంచింది. రుచికరమైన భోజనం వడ్డిస్తుండడంతో రోగులు సంతృప్తిగా తింటున్నారు. ఆస్పత్రుల్లో సేవలు పొందుతున్నవారి నోట భోజనం బాగుందయ్యా అనే మాటే వినిపిస్తోంది.

11 ఆస్పత్రుల్లో డైట్ చార్జీల అమలు

జిల్లాలో వైద్య విధాన్ పరిషత్, వైద్య విద్య పరిధిలో ఉన్న 11 ఆస్పత్రుల్లో డైట్ (భోజనం) అమలవుతోంది. వైద్య విధాన్ పరిషత్ పరిధిలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రి, సాలూరు, గజపతినగరం, ఎస్.కోట ఏరియా ఆస్పత్రులు, భద్రగిరి, బొబ్బిలి, బాడంగి, చీపురుపల్లి భోగాపురం సీహెచ్‌సీలు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ఘోషాస్పత్రుల్లో డైట్ అమలవుతోంది.



సర్వజన ఆస్పత్రిలో భోజనం చేస్తున్న రోగి

మూడు పూటలా భోజనం

ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స పొందే రోగులకు మూడుపూటలా భోజనం పెడతారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి కూడ భోజనం వడ్డిస్తారు. సాధారణ రోగులకు మూడు పూటలా భోజనం పెట్టేందుకు గత టీడీపీ ప్రభుత్వం డైట్ చార్జీలను కేవలం రూ. 40 చెల్లిస్తే.. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.80కి పెంచింది. నైట్ డ్యూటీ చేసే వైద్యులకు భోజనం నిమత్తం చెల్లించే డైట్ చార్జీలు రూ.80 నుంచి రూ.100కు, మానసిక రోగులకు రూ.56 నుంచి రూ.80కి పెంచింది. దీంతో రోగులకు రుచికరమైన భోజనం లభిస్తోంది.

800 నుంచి 900 మంది రోగులకు భోజనం

జిల్లాలో 11 ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు రోజుకి వందలాది మందికి భోజనం పెడుతున్నారు. సగటున ప్రతిరోజు 800 నుంచి 900 మంది వరకు భోజనం పెడుతున్నారు. ఉదయం ఇడ్లీ లేదా ఉప్మా,లేదా కిచెడీ పెడుతున్నారు. మధ్యాహ్నం అన్నం, సాంబారు, కూర, గుడ్డు, అరటిపండు, మజ్జిగ అందజేస్తారు. రాత్రికి అన్నం, సాంబారు, కూర, గుడ్డు, మజ్జిగ పెడతారు.

రక్తదాతలే ప్రాణదాతలు

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: రక్తదాతలే ప్రాణదాతలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషి మాత్రమే ఆపదలో ఉన్న సాటి మనిషికి రక్తం ఇచ్చి ప్రాణాలు కాపాడగలడన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు పర్యాయాలు రక్తదానం చేయవచ్చునని చెప్పారు. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి అనారోగ్యం రాదని, నిరంతరం రక్తదానం చేయడం వల్ల రక్తం కొరత లేకుండా చేయవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిలా సునందని, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పీపీ రమణి, ఆర్ఎంఓ డాక్టర్ ఎన్.సురేష్‌బాబు, డాక్టర్ వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో ధారగంగమ్మ పండగ

శృంగవరపుకోట: ఎస్.కోట గ్రామదేవత ధారగంగమ్మ పంగడను ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించారు. పాండవుల చావిడి వద్ద మంగళవారం నిర్వహించిన పంచాంగ శ్రవణంలో పండగ తేదీలను ప్రకటించారు. 27న తొలేళ్లు, 28న అనుపోత్సవం నిర్వహిస్తామని ధారగంగమ్మ ఆలయ అనువంశిక పూజారి మోపాడ గౌరునాయుడు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వేమలి పెదనారాయణరావు, మాజీ వైస్ ఎంపీపీ ఎస్.రమణాజీ, ఆర్యవైశ్య పెద్దలు బొండా వెంకటరావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను లారీ ఢీకొని వ్యక్తి మృతి



లారీ కింద పడిన సంగమేష్

బలిజిపేట: బలిజిపేట–మిర్తివలస మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బలిజిపేట మండలంలోని వెంగాపురం గ్రామానికి చెందిన ఎస్.సంగమేష్(24) విజయనగరంలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై పాపారావు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు చెప్పారు. ఫిర్యాదు మేరెకు వివరాలిలా ఉన్నాయి. ట్రాక్టర్ డ్రైవర్ అయిన సంగమేష్ వెంగాపురం నుంచి మిర్తివలస బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యంలో మలుపువద్ద ఎదురుగా బొబ్బిలి నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. ప్రమాదం జరిగిన వెంటనే బొబ్బిలి హాస్పిటల్‌కు తరలించి ప్రథమ చికిత్స అనంతరం విజయనగరంలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు సంగమేష్ ట్రాక్టరు డ్రైవర్ కాగా 18నెలల క్రితం మిర్తివలస గ్రామానికి చెందిన పద్మతో వివాహం జరిగింది. వారికి 3 నెలల బాబు ఉన్నాడు.



మృతి చెందిన సంగమేష్

వేడుకగా విజయభావన 39వ వార్షికోత్సవం



కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులు, సాహితీవేత్తలు

- ఆకట్టుకున్న కవితా గోష్ఠి
- యల్లపు ముకుంద రామారావుకు ఉగాది పురస్కారం
- మండ రామప్రసాద్‌కు ఆచార్య భావన్ పురస్కారం

విజయనగరం టౌన్: స్థానిక లయన్స్ క్లబ్ వేదికగా విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య 39వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ మేయర్ శ్రావణి పురస్కార ప్రదాతగా వ్యవహరించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కవి, బహుభాషానువాదకుడు యలపు ముకుంద రామారావుకు ఈ ఏడాది విజయ భావన ఉగాది పురస్కారాన్ని అందజేశారు. దుశ్శాలువ, జ్ఞాపికతో ఆయనను ఈ సందర్భంగా సత్కరించారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయి ఏకపాత్రాభినయ రచన పోటీల్లో విజేతగా నిలిచిన విశాఖ స్టీల్ ప్లాంట్‌కు చెందిన డాక్టర్ మండ రామప్రసాద్‌కు ఆచార్య భావన్ స్మారక పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ విజయ భావన సంస్థతో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

ఆకట్టుకున్న కళారూపాల ప్రదర్శన

ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఐ.కృష్ణకాంతి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ఉదయం ప్రారంభించారు. వెలుగు వృద్ధాశ్రమ నిర్వాహకుడు డాక్టర్ ఖలీల్‌బాబు ఏర్పాటుచేసిన టెర్రకోట మృణ్మయ కళారూపాల ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం కవులు తమ పాండిత్య ప్రతిభను చూపారు. అభినయ సంధ్య కార్యక్రమంలో భాగంగా ఏకపాత్రాభినయంలో ఆకొండి కృష్ణతేజ దుర్యోధనుడిగా, కృష్ణప్రియ ద్రౌపదిగా, పీఎస్‌వీ.శేషాచార్యులు వకులుడిగా పాత్రోచితమైన నటనను ప్రదర్శించారు. ఇబ్రహీమ్ ఖాన్, డాక్టర్ భైరవభట్ల విజయాదిత్యలు చేసిన నాట్యప్రదర్శన రక్తికట్టించింది. సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ పాఠశాలల్లో చిన్నారులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు భోగరాజు బాబూజీ, సూర్యలక్ష్మి, డాక్టర్ జక్కు రామకృష్ణ, ధవళ సర్వేశ్వరరావు, మేకా అనంతలక్ష్మి, అనిల్ కుమార్, బాబూరావు, ఈఆర్.సోమయాజులు(రాంజీ), సీహెచ్.దుర్గాప్రసాద్, పువ్వాడ వెంకట భాస్కర్ పాల్గొన్నారు.



ముకుందరావుకు ఉగాది పురస్కారం అందజేస్తున్న నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తదితరులు

కడుపులో చల్ల కదలకుండా..!

- వయోవృద్ధులకు ఇంటి వద్దే ఓటింగ్
- ఎన్నికల కమిషన్ నూతన విధానం
- మొబైల్ ఓటింగ్ వాహనంతో అవకాశం
- ఫారం–12తో దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో మే 13న రాష్ట్రంలో శాసనసభ, లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు, ప్రతి ఒక్కరికీ ఓటు వేసే అవకాశం కల్పించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ అనేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇటీవల చేపట్టిన ఓటర్ల జాబితా సవరణలో 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటరూ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన పెంచేందుకు సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే ఈ సారి సరికొత్త కార్యక్రమానికి ఎన్నికల యంత్రాంగం శ్రీకారం చుట్టింది. పోలింగ్ కేంద్రాలకు రాలేని దుస్థితిలో ఉన్న దివ్యాంగులు, వయోవృద్ధులకు హోమ్ ఓటింగ్ (ఇంటి నుంచే ఓటు వేయడం) విధానాన్ని రానున్న ఎన్నికల్లో అమలు చేస్తోంది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తుండగా ఇప్పుడు మన రాష్ట్రంలో అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. దివ్యాంగులు, వయోవృద్ధులు ఎన్నికల కేంద్రాలకు వచ్చి ఓటు వేసేందుకు గతంలో నానా ఇబ్బందులు పడేవారు. తాజా నిర్ణయంతో వారికి ఈ కష్టాలు తొలగనున్నాయి. హోమ్ ఓటింగ్ కోసం మొబైల్ ఓటింగ్ వాహనాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతానికి మించి వైకల్యం ఉన్నవారు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు దీని ద్వారా అవకాశం కలగనుంది. అయితే పోస్టల్ బ్యాలెట్ తరహాలోనే హోమ్ ఓటింగ్‌కు కూడా ముందుగానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇంటి నుంచే ఓటు వేయడానికి అర్హులైన వారిని బూత్ లెవెల్ అధికారి (బీఎల్‌ఓ) సంప్రదించి, వారి ఆసక్తికి అనుగుణంగా దరఖాస్తు చేయిస్తారు. జిల్లాలో ఇప్పటికే ఈ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు.



ఓటర నమోదు చైతన్య ర్యాలీలో పాల్గొన్న దివ్యాంగులు

- హోం ఓటింగ్ కావాలనుకునే వారు ముందుగా ఫారం–12డి ద్వారా ఈఆర్‌ఓకు దరఖాస్తు చేసుకోవాలి. పరిశీలన అనంతరం అర్హులైన వారి జాబితాను ఈఆర్‌ఓ స్థాయిలో రూపొందిస్తారు.

ఓటు వేసే విధానం

అర్హులైన ఓటర్లకు ఏ రోజు ఓటు వేయాలో అధికారులు ముందుగానే సమాచారం ఇస్తారు.

- ఓటింగ్ మొబైల్ వాహనం ద్వారా ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని వారికి కల్పిస్తారు. బ్యాలెట్ పేపర్‌పై రహస్యంగా ఓటు వేసేలా ఏర్పాటు చేస్తారు. ఈ ప్రక్రియ అంతా వీడియో తీస్తారు.
- ఆ ఓటును సీల్ చేసిన అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ద్వారా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తరలిస్తారు.

నూతన ఓటర్ల నమోదు కోసం ముమ్మరంగా స్వీప్

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు ప్రతి మండలంలోనూ అంధికారులు ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టారు. కొత్తగా ఓటు కోసం ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోవాలనుకున్నా, చిరునామాలో మార్పులు చేసుకోవాలనుకున్నా ఈ నెల 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. కొత్త ఓటు కోసం ఓటరు హెల్ప్‌లైన్ యాప్, వీఓటీఈఆర్ఎస్.ఈసీఐ.జీఓవీ.ఐఎన్, సీఈఓఏపీఎన్‌డీహెచ్‌ఆర్‌ఏ.ఎన్‌ఐసీ.ఐఎన్ వెబ్‌సైట్‌ల ద్వారా ఫారం–6లో దరఖాస్తు చేయాలి. అలాగే చిరునామా మార్పు, ఓటు బదిలీ కోసం ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తులను పది రోజుల్లో పరిశీలించి, అర్హత ఉంటే ఓటర్ల జాబితాలో చేరుస్తారు. తద్వారా వీరికి మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లభిస్తుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

పైడితల్లికి అరిసెల నివేదన



అరిసెలు, యాపిల్ పండ్ల నివేదనలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్:

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారికి ఉగాది పర్వదినాన పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి విశిష్ట పూజలు చేశారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు కుంకుమార్చనలు నిర్వహించారు. పైడితల్లికి ప్రీతికరమైన అరిసెలు, యాపిల్ పండ్లను నైవేద్యంగా సమర్పించారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పూజాకార్యక్రమాలను పర్యవేక్షించారు.

'వల'సకు విముక్తి



చింతపల్లిలో ఫ్లోటింగ్‌జెట్టీ నిర్మించాల్సిన ప్రదేశం

పూసపాటిరేగ: సముద్రతీరప్రాంతాల్ని అభివృద్ధి చేసి మత్స్యకారులకు జీవనోపాధి అవకాశాల్ని మెరుగుపరచాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. గత ప్రభుత్వంలో నిరాదరణకు గురైన మత్స్యపరిశ్రమలను అభివృద్ధి చేసి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంస్కరణలు విజయవంతమవుతున్నాయి. విజయనగరం జిల్లాలో తీరప్రాంత మండలాలైన పూసపాటిరేగ, భోగాపురంలో నివసిస్తున్న మత్స్యకారులు తమసొంత గ్రామాల్లోనే వేట చేసుకోవడానికి వీలుగా రూ.23 కోట్ల ఖర్చుతో చింతపల్లిలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే వర్చువల్ విధానంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.

వేటపై ఆధారపడిన 21వేల మంది

తీరప్రాంత మండలాలు పూసపాటిరేగ, భోగాపురంలలో 19 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో సుమారు 21 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. వేటపై ప్రత్యక్షంగా 6 వేల మంది, పరోక్షంగా 15 వేల మంది ఆధారపడి ఉన్నారు. జెట్టీ లేకపోవడంతో ఏటా సుమారు 6 వేల మంది మత్స్యకారులు మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలైన గుజరాత్, తమిళనాడు, సూరత్, తదితర ప్రాంతాలకు వలస వెళ్లి కూలీలుగా మారుతున్నారు. జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 27 కిలోమీటర్ల పొడవున తీర ప్రాంతం ఉంది. ఆయా గ్రామాల పరిధిలో గల మత్స్యకారులకు 450 ఇంజిన్‌బోట్లు, 150 సంప్రదాయ బోట్లు ఉండటంతో మత్స్యకారులు వేట చేస్తున్నారు. జెట్టీ లేకపోవడతో ప్రస్తుతం నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన బోట్లను ఒడ్డుకు చేర్చడానికి మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుఫాన్ సమయంలో బోట్లు దెబ్బతినడం, ఈదురు గాలులకు సముద్రంలోకి కొట్టుకు పోవడం తదితర సంఘటనలతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఫ్లోటింగ్ జెట్టీ పనులు పూర్తయితే సుమారు 6 వేల మంది మత్స్యకారులు తాము నివసిస్తున్న సొంత గ్రామాల్లో ఉండి జీవనోపాధి పొందవచ్చు. ఫ్లోటింగ్ జెట్టీ ఉండడంతో ఇతర ప్రాంతాల బోట్లు ఇక్కడకు వచ్చి మత్స్య సంపద ఎగుమతులు, దిగుమతులు పెరిగే అవకాశం ఉంది. నిర్మాణం పూర్తయిన వెంటనే ప్రత్యక్షంగా, పరోక్షంగా వందల సంఖ్యలో మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.